## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ జంగాలపల్లె, చిరుమామిళ్ళ, సంకురాత్రిపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అలాగే గణపవరం గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ అశోక్ కుమార్ తెలిపారు. గ్రామంలోని మరబావి సెంటర్, ఎస్సీ కాలనీ, వెటర్నరీ ఆసుపత్రి ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

### 8న ఎస్ఎంసీ ఎన్నికలు

నాదెండ్ల: మండలంలోని 64 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి తెలిపారు. ఈ నెల 5న ఇప్పటికే పాఠశాలల్లో ఓటర్ల జాబితా సిద్ధంగా ఉందని, ఈ నెల 5న ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకూ జాబితాపై అభ్యంతరాలుంటే స్వీకరించనున్నట్లు తెలిపారు. అదేరోజు 3–4 గంటల మధ్య ఎన్నికల నిర్వహణ కోసం తుది జాబితా ప్రకటిస్తామన్నారు. 8న ఉదయం 7–8 గంటల వరకూ ఎన్నిక జరుగుతుందన్నారు. ఒక్కో క్లాసు నుంచి ముగ్గురు చొప్పున ఎన్నిక చేసిన అనంతరం చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక జరుగుతుందన్నారు. మండలంలో 49 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 9 జిల్లా పరిషత్, మోడల్‌స్కూలు, కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో ఎన్నికలు జరుగుతాయన్నారు.

### సైన్స్ ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



నరసరావుపేట రూరల్: ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ పరీక్షలలో శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి శనివారం తెలిపారు. సైన్స్ ఒలంపియాడ్ లో స్టేట్ టాపర్‌గా జి.నాగశ్రీ రూ.1000 నగదు బహుమతి, గోల్డ్‌మెడల్ సాధించినట్టు తెలిపారు. అలాగే స్టేట్ ఎక్స్‌లెన్స్ అవార్డుల్లో కొల్లిపర రుత్విక్, పి.సంజయ్‌లు గోల్డ్‌మెడల్స్ సాధించారని వివరించారు. సబ్జెక్ట్‌ల వారీగా టాపర్లుగా 12 మంది విద్యార్థులు మెడల్స్ పొందినట్టు తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, జి.శంకర్, సూరిబాబు, జి.శివప్రియ, ఎస్.పావనిలను ప్రధానోపాధ్యాయినీ పార్వతి సత్కరించారు.

### రేషన్ బియ్యం స్వాధీనం



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం భూమాయపాలెం వద్ద రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా ఐనవోలు పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. ఏపీ 39 యూపీ 9792 నంబరు గల ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకోవడం జరిగింది. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం ఎవరి వద్ద నుంచి ఎక్కడి తరలిస్తున్నారు అనే సమాచారం తెలియాల్సి ఉందని, కనీసం ప్రభుత్వ గోతాలు కూడా మార్చకుండా రేషన్ బియ్యం మాఫియా జరుగుతుందని, లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు.

### విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి



నూజెండ్ల: మండలంలోని పమిడిపాడులో విద్యుదాఘాతానికి గురై ఓ వృద్ధ మహిళ మృతి చెందింది. గ్రామానికి చెందిన గంగవరపు పెదపేరమ్మ (65) పొలానికి వెళ్లింది. ఈక్రమంలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెను రక్షించబోయి ఎండ్లూరి వీరయ్యకు విద్యుదాఘాతమై గాయాలయ్యాయి.

### డివైడర్ ఢీకొని వ్యక్తికి గాయాలు



రొంపిచర్ల: స్థానిక శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన సోలిశెట్టి నాగవర్ధన్‌కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగవర్ధన్ హైదరాబాద్ నుంచి ద్విచక్రవాహనంపై ఒంగోలు సమీపంలో ఉన్న కామేపల్లి పోలేరమ్మ అమ్మవారి గుడికి బయలుదేరాడు. రొంపిచర్ల సమీపంలోకి రాగానే చెక్ పోస్ట్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నాగవర్ధన్‌కు గాయాలయ్యాయి. తలకు హెల్మెట్ ధరించటం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. ఎస్ఏఎం ఎక్స్‌ప్రెస్ వే అంబులెన్స్‌లో గాయాలైన నాగవర్ధన్‌ను నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

# మాదకద్రవ్యాలతో జీవితాలు ఛిన్నాభిన్నం




గణపవరం సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతి



సదస్సులో మాట్లాడుతున్న వినుకొండ జడ్జి మహతి




ర్యాలీలో పాల్గొన్న అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. సత్యశ్రీ, ఇతర న్యాయమూర్తులు

- అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతి
- సీఆర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు

నాదెండ్ల: మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు ఛిన్నాభిన్నమౌతాయని, యువత దుర్వ్యసనాలకు బానిసలుగా మారకుండా మంచి అలవాట్లతో అందమైన జీవితాన్ని సాకారం చేసుకోవాలని చిలకలూరిపేట అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఐ.స్వాతి చెప్పారు. గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో శనివారం మాదక ద్రవ్యాల వినియోగం, దుష్పరిణామాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.నరేంద్రరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, మత్తు పదార్థాలు సేవించటం ఆరోగ్యానికి హానికరమని, చట్టరీత్యా నేరమన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఎంతో ప్రమాదమని, చిన్న వయస్సులోనే ప్రాణాలు కోల్పోతారన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారిని రిహాబిలిటేషన్ సెంటర్‌కు పంపి సన్మార్గంలో నడిచేలా చేయవచ్చన్నారు. యువత మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేలా పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, న్యాయవాదులు బి.రాజేష్, ఎం.భానుప్రసాద్, పి వెంకట్, జి.వి.హెచ్.ఎస్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలి: జూనియర్ సివిల్ జడ్జి మహతి**

వినుకొండ(నూజెండ్ల): విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి మహతి అన్నారు. జాతీయ లీగల్ సెల్ అథారిటీ, న్యూఢిల్లీ ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీస్ అథారిటీ అమరావతి సూచనలతో వినుకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ఎం.మహతి మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటినుంచే భవిష్యత్‌ను జాగ్రత్తగా మలచుకోవాలని, తోటి విద్యార్థులను, గురువులను గౌరవిస్తూ సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని తెలియజేశారు. ఈ డ్రగ్ మహమ్మారి నుంచి జాగ్రత్తగా ఉండాలని, వాటి వల్ల మెదడు పనితీరు మందగిస్తుందని, మనిషి నియంత్రణ కోల్పోతారని తెలియజేశారు.

కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేఎస్ఎస్‌వీ నాయుడు, సెక్రటరీ పఠాన్ గౌస్ మొహిద్దీన్‌ఖాన్, ఆరె సామ్రాజ్యం, ఆళ్ల మహేశ్వరరెడ్డి, దూళ్ల నాగరాజు, ముట్లూరు చంటి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

13వ అదనపు న్యాయమూర్తి ఎస్. సత్యశ్రీ

నరసరావుపేట టౌన్: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి బంగారు భవిష్యత్‌ను కోల్పోవద్దని 13వ అదనపు న్యాయమూర్తి ఎస్. సత్యశ్రీ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నిరోధంపై శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె మాట్లాడారు. ర్యాగింగ్ చేయటం వలన కలిగే దుష్పరిణామాలను వివరించారు. ర్యాగింగ్ చట్టం గురించి తెలియజేశారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండి క్రమ శిక్షణతో పాటు నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. కోర్టు ప్రాంగణం నుంచి మొదలైన ర్యాలీ ప్రధాన అంతర్గత వీధులమీదుగా కొనసాగింది. కార్యక్రమంలో న్యాయమూర్తులు కె. మధుస్వామి, ఆర్. ఆశీర్వాదం పాల్, టి. ప్రవల్లిక, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ఆర్డీవోను కోరిన సీఐటీయూ నాయకులు



ఆర్డీవో పి.సరోజనీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, ఉద్యోగులు

నరసరావుపేట: పురపాలక సంఘంలో గత ఐదేళ్ల నుంచి పనిచేస్తున్న వారిని రాజకీయ ఒత్తిళ్ల మేరకు తొలగించటం దారుణమని, మళ్లీ వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఉద్యోగులతో కలిసి ఆర్డీవో పి.సరోజనీకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు డి.శివకుమారి, షేక్ శిలార్ మాట్లాడుతూ 55 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఆప్కాస్ ద్వారా చేరి గత ఐదేళ్ల నుంచి పనిచేస్తున్నారన్నారు. వీరిని ఉద్యోగాల్లోకి రావొద్దంటూ తన సిబ్బందిచే గత నెల 31న కమిషనర్ ఫోన్ చేయించారన్నారు. పనిలో ఎటువంటి లోపం లేకుండా పనులు చేస్తున్న కార్మికులను అధికారపార్టీ నాయకుల ఆదేశాల మేరకు తాము పనిలోకి రావొద్దని చెప్పామని అధికారులు చెబుతున్నారన్నారు. ఈనెల రెండో తేదీన కమిషనరు ముగ్గురు కార్మికులు, ఏఈ ఇద్దరు కార్మికులను నేరుగా పనిలోకి రావొద్దని చెప్పారన్నారు. కక్షసాధింపు చర్యల్లో భాగంగా ఇదంతా చేస్తున్నారని అన్నారు. వీరి చర్యలను ఆపించాలని, తమ పనులు తాము చేసుకునేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఆర్డీవోను కోరారు.

### ఉపాధి హామీపై గ్రామసభలు

నాదెండ్ల: మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, చిరుమామిళ్ళ, సాతులూరు, నాదెండ్ల, గొరిజవోలు, చందవరం, కనపర్రు గ్రామాల్లో శనివారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీపై గ్రామ సభలు నిర్వహించారు. ఆయా సభలకు గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం కూలీలు హాజరయ్యారు. సాతులూరులో జరిగిన కార్యక్రమానికి సర్పంచ్ ముసుగు శోభారాణి అధ్యక్షత వహించారు. డీఆర్‌పీ డి.ప్రసాదరావు మాట్లాడుతూ 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకూ జరిగిన పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. ఈనెల 8న జరిగే గ్రామ సభలో ఆయా వివరాలు వెల్లడిస్తామన్నారు. వివిధ గ్రామాల్లో జరిగిన గ్రామసభలకు డీఆర్‌పీలు ఓబులేసు, ఆదినారాయణ, ఎం.శివయ్య, మహేష్, కిషోర్‌కుమార్, తిరుపాల్‌తో పాటూ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండండి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి

చిలకలూరిపేట: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి చెప్పారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పురుషోత్తమపట్నం, సుగాలీ కాలనీల్లో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఖాళీ కొబ్బరి బొండాలు, పాత టైర్లు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే అందులో పెరిగే దోమల కారణంగా డెంగీ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రెండు ఆసుపత్రుల వైద్యులు డాక్టర్ సాయి కిరణ్, డాక్టర్ రాణి సంయుక్తలు వ్యాయామం, నడక, ఆరోగ్య విషయాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సుమన్, న్యాయవాదులు పోతుల వెంకట్, జీవీహెచ్ఎస్ ప్రసాద్, మాదాసు భానుప్రసాద్ పాల్గొన్నారు.

### అమ్మవారికి సారె సమర్పణ



నరసరావుపేట ఈస్ట్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పాతూరులోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీభీమలింగేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీపార్వతీ అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధి మద్ది బాలసుబ్రహ్మణ్యం, అంజనాదేవి దంపతుల ఆధ్వర్యంలో 108 మంది మహిళలు శ్రీ భీమలింగేశ్వరుని ఆషాఢ పట్టే, అమ్మవారికి సారె అందించారు. కార్యక్రమంలో మద్ది రామబ్రహ్మానందరావు, చేగు వెంకటేశ్వర రావు, యక్కల సుజాత, శివపార్వతీ, నాగసరపు ఉషారాణి పాల్గొన్నారు.

## విద్యార్థి వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలి

- గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలి
- బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బాబూరావు డిమాండ్



అనారోగ్యం పాలైన విద్యార్థినిని వైద్యశాలకు తీసుకెళుతున్న తల్లితండ్రులు

రొంపిచర్ల: తీవ్ర అనారోగ్యం పాలైన పదోతరగతి విద్యార్థినీ వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలని, అందుకు కారణమైన సంతగుడిపాడు కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బూదాల బాబూరావు డిమాండ్ చేశారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అన్నవరప్పాడు గ్రామానికి చెందిన సరిమల్ల సన్నిధి అనే విద్యార్థినీ పదవ తరగతి పరీక్షలకు ముందు జ్వరం వచ్చిందని, ఈ విషయం ప్రిన్సిపాల్‌కు తెలియచేసినా వైద్యం చేయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. కనీసం ఆ కుటుంబానికి సమాచారం ఇవ్వలేదన్నారు. ఆ అమ్మాయి ఇంటికి పంపించకుండా పరీక్షలు అయిపోయేంత వరకు నిర్లక్ష్యం వహించడంతో ఆ అమ్మాయికి జ్వరంతోపాటు కామెర్లు అయ్యాయని, అవి బాగా ముదిరి శరీరంలోని అవయవాలు చెడిపోయి నేడు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోందన్నారు. కూలీ చేసుకుని బతికే కుటుంబమని, ఇప్పటికే లక్షల దాకా ఖర్చు పెట్టినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. వైద్యులు ఆ అమ్మాయిని హైదరాబాదులో అపోలో హాస్పిటల్‌కి తీసుకెళ్లాలని, అక్కడ సుమారు రూ.15 లక్షలు ఖర్చవుతుందని చెప్పారని, ప్రభుత్వం ఆదుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

## సంక్షిప్త వార్తలు

**ప్రతిభగల వారిని ప్రోత్సహించడం శుభపరిణామం**

చిలకలూరిపేట: ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని మోడరన్ విద్యాసంస్థల డైరెక్టర్ చేబ్రోలు మహేష్ చెప్పారు. అమెరికాలోని పెన్సిల్వేనియాలో సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన ఆప్తీ చౌదరి 20 మంది ప్రతిభగల విద్యార్థులకు రూ. 2.20 లక్షలు ఆర్థిక సహాయం శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజు, ఇన్‌చార్జి చేబ్రోలు శ్రీరాములు, కందుల ఆంజనేయులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటం**

చిలకలూరిపేట: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ముందుండి పోరాడుతోందని ఆ పార్టీ ఏరియా కార్యదర్శి నాగభైరు రామ సుబ్బాయమ్మ చెప్పారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈనెల 5వ తేదీన నరసరావు పేటలోని సీపీఐ కార్యాల యంలో జిల్లా జనరల్ బాడీ సమావేశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పేలూరి రామారావు, నాయుడు శివకుమార్, బొంతా భగత్‌సింగ్, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి మేకపోతుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**ఈ–పంట నమోదుపై అవగాహన కల్పించాలి**

నరసరావుపేట రూరల్: ఈ–పంట నమోదుపై రైతుల్లో అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ. మురళీ తెలిపారు. లింగంగుంట్లలోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో శనివారం పొలంబడి నిర్వాహణ, ఆర్గానిక్ సర్టిఫికేషన్ పొందేందుకు రైతులను సంసిద్ధం చేసే అంశాలపై వ్యవసాయాధికారులతో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ కమిషనర్ కార్యాలయ సంచాలకులు యం.వెంకటేశ్వర్లు, ఏపీఎస్‌వోపీసీఏ గుంటూరు యివాల్యుమేటర్ యం.సారిక, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నగేష్, జిల్లా వనరుల కేంద్రం డీడీఏ యం.శివకుమారి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం కె.అమల కుమారిలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష**

యడ్లపాడు: బిడ్డలకు తల్లిపాలకు మించిన ఆహారం మరొకటి లేదని ఐసీడీఎస్ సొలస సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.జోజమ్మ చెప్పారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా యడ్లపాడు మండలంలోని అన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం గృహ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. తమ కేంద్రం పరిధిలోని ఇళ్లకు వెళ్లి కిషోరబాలికల తల్లులు, గర్భిణులు, బాలింతలకు తల్లిపాలు ఆవశ్యకతపై వివరించారు. తల్లి బిడ్డకు తనపాలను పట్టించడం వలన వారిలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు.

**చికిత్స పొందుతూ యువకుడి మృతి**

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీసీ కెమెరాలను బిగించే నిమిత్తం వంశీ అతని మిత్రుడు గజ్జ శ్రీకాంత్ బైక్‌పై శుక్రవారం రాత్రి పట్టణం నుంచి నరసరావుపేట మార్గంలో బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో పశువుల సంత వద్ద ఎదురుగా వస్తున్న బైక్ వీరి వాహనాన్ని ఢీకొంది. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న శ్రీకాంత్‌కు తీవ్రంగా, వంశీకు స్వల్పగాయాలు అయ్యాయి. దీంతో శ్రీకాంత్‌ను గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. శ్రీకాంత్ తండ్రి గజ్జా గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం**

నరసరావుపేట: పట్టణ నడిబొడ్డున ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు చింతిరాల మీరయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు.సదరు వర్గీకరణ వలన మాదిగలు, 59 మాదిగ ఉప కులాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

**తల్లిపాలు అవశ్యం**

నాదెండ్ల: బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకూ కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.పద్మ చెప్పారు. చిరుమామిళ్ళ కేంద్రంలో వారోత్సవం నిర్వహించారు.

# రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయి

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని, సామాన్యులకు రక్షణ లేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 50 రోజుల క్రితం వినుకొండ రూరల్ మండలం ఏనుగుపాలం గ్రామంలో చింతల దేవి అనే మహిళని దారుణంగా హత్య చేయడం జరిగిందని, కనీసం నిందితులు ఎవరనేది పోలీసులు ఇంతవరకు గుర్తించలేకపోయారన్నారు. తన భార్యను హత్య చేసిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాల్సిందిగా దేవి భర్త శ్రీను ఎన్నిసార్లు పోలీసులను ఆశ్రయించినప్పటికీ సరైన సమాధానం కూడా చెప్పడం లేదన్నారు. హత్యకు సంబంధించి రిపోర్టులు రావాల్సి ఉందని వచ్చిన తర్వాత నిందితులను గుర్తించి పట్టుకుంటామని పోలీసులు చెప్పగా కొన్ని రోజులు ఆ రిపోర్టుల కోసం ఎదురు చూడటం జరిగిందని, తీరా రిపోర్టులు వచ్చి సుమారు పది రోజులు అవుతున్నా ఇంతరవకు కనీసం పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. రిపోర్టులు వచ్చిన మరుసటి రోజు నుంచి తన గ్రామంలో కొందరు తనను చంపుతానని బెదిరిస్తున్నారని, హత్యకు గురైన శ్రీదేవి భర్త తన వద్ద వచ్చి విన్నవించుకున్నట్లు చెప్పాడని ఆయన తెలిపారు. దేవి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని ఈ కేసులో అసలు ముద్దాయిలను పట్టుకొని వారిని కఠినంగా శిక్షించే వరకు పోలీస్ వారిపై ఒత్తిడి తీసుకొస్తానని బొల్లా బ్రహ్మనాయుడు వెల్లడించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

న్యాయ పోరాట కమిటీ (ఐద్వా) నాయకుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు




ప్రదర్శన చేస్తున్న నాయకులు, దళిత మహిళలు

నరసరావుపేట: ఫిరంగిపురం మండలం గరుడాచలపాలెం దళిత మహిళలపై దాడిచేసి కొట్టి సాంఘిక బహిష్కరణకు గురిచేసిన సంఘటనలపై జిల్లా కలెక్టర్, ఎస్పీలు స్వయంగా బాధిత వర్గాన్ని సందర్శించి న్యాయం చేయాలని బాధితుల న్యాయ పోరాట కమిటీ (ఐద్వా) నాయకుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు కోరారు. శనివారం ఈ సంఘటనపై మొదటి ఏఎంఎం కోర్టులో విచారణ జరిగింది. అనంతరం బాధిత మహిళలతో కలిసి ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ నాల్గున ఎన్నికల ఫలితాల అనంతరం కూటమి పార్టీ వర్గీయులు బైకు ర్యాలీ చేసి గ్రామంలో ఇరువురు దళిత మహిళలపై దాడిచేసి కులం పేరుతో దూషిస్తూ కొట్టి చంపుతామని బెదిరించారన్నారు. అదే నెల 8న 40 కుటుంబాలకు చెందిన దళితులను సాంఘిక బహిష్కరణ చేశారన్నారు. 14వ తేదీన ట్రాక్టర్ డ్రైవర్‌ను చంపబోయారని, 16వ తేదీన తాళ్ల శేఖర్ అనే వ్యక్తిపై రెండుసార్లు దాడిచేసి చంపబోయారని వివరించారు. వీటన్నింటిపై చర్యలు తీసుకోవాలని కోరితే వారే బాధితులపై తప్పుడు కేసులు పెట్టి జైలు పాలు చేశారని అన్నారు.

ఈ సంఘటనలపై కలెక్టర్, ఎస్పీలు సంయుక్తంగా గ్రామాన్ని సందర్శించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం రూల్ 12 ప్రకారం విచారణచేసి దళిత మహిళలకు న్యాయం చేయాలని కోరారు. దీంతో పాటు సీబీడీ దర్యాప్తు చేయాలని కోరారు. న్యాయవాది కాశిమళ్ల విజయకుమార్ పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగులు మెరుగైన పనితీరు కనబరచాలి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట: సచివాలయ ఉద్యోగులు మెరుగైన పనితీరు ప్రదర్శించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని 17,18,19,20 నంబరు సచివాలయాలను ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. సచివాలయ సిబ్బంది వివరాలు, వారు అందించే సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించేది వార్డు, గ్రామ సచివాలయాలే అని తెలిపారు. సచివాలయ సిబ్బంది అంకితభావంతో పనిచేస్తే వార్డులలో సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని చెప్పారు. పట్టణంలో శానిటేషన్, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, దోమల నియంత్రణ, ఆక్రమణల తొలగింపు, అనధికార లేఅవుట్‌ల నియంత్రణ ప్రథమ ప్రాధాన్యాలుగా పెట్టుకున్నామని చెప్పారు. ఈ అంశాలను విజయవంతంగా అమలు చేసేందుకు సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని తెలిపారు.

## మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసు

- చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు హెచ్చరిక
- యడ్లపాడు పోలీస్‌స్టేషన్ సందర్శన
- రికార్డులు పరిశీలన, సిబ్బందికి పలు సూచనలు



యడ్లపాడు: మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు అవుతాయని చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు హెచ్చరించారు. యడ్లపాడు మండల పోలీస్‌స్టేషన్‌ను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా యడ్లపాడు స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఐ వి.బాలకృష్ణ ద్వారా పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. సిబ్బంది సమన్వయంతో పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రికార్డులను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు.

అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే వారితోనూ మర్యాదగా నడుచుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లోని ప్రజలు స్నేహపూర్వకంగా పోలీసులు ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలిస్తే వారి పేరెంట్స్‌ను స్టేషన్‌కు పిలించి వారిపై కేసులు పెట్టాల్సి వస్తుందన్నారు. అలా రెండుసార్లు కేసులు నమోదైతే వారి వాహన లైసెన్సులు రద్దు చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో ఏదైనా సమస్య వచ్చినపుడు ఇరువర్గాలకు చెందిన పెద్దలు ముందుగా మాట్లాడుకుని సామరస్యంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలన్నారు.

అలాకాకుండా లేనిపోని భేషజాలకు పోయి ఘర్షణలు పడితే ఆర్థిక, ఆరోగ్యపరంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. అలాగే కుటుంబాలు ఛిన్నాభిన్నం కావడం చేస్తున్న పనులు, సమయం వృథా అవుతుందన్నారు. తద్వారా మానసిక ఒత్తిడిలకు గురి కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రహించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్నట్లు స్థానికులు గుర్తిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.